ఈనాడు

THE HEART AND SOUL OF ANDHRA PRADESH

Tuesday , November 14, 2006

అమెరికాలోని తెలుగు సంఘాల ఆధ్వర్యంలో ...

# ప్రొఫెసర్ రామమూర్తికి సన్మానం



ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల పరిశోధనఫలాలు గ్రామీణ భారతానికి చేరినప్పుడే దేశ ప్రగతి సాధ్యమని ప్రొఫెసర్ రాళ్లపల్లి రామమూర్తి అన్నారు. అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో రామమూర్తిని తెలుగు సంఘాలు ఘనంగా సన్మానించాయి. టెక్సాస్‌లోని రిచర్డ్సన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని 'తానా', 'ఆటా' టాంటెక్స్( తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్) ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ భారతదేశాన్ని విజ్ఞానఖనిగా తయారుచేయాలన్నదే తన అభిమతమన్నారు. సహనం, నిబద్ధతల్ని ప్రతి విద్యార్థీ ప్రాథమికదశనుంచి ఆచరించినప్పుడే భావిజీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. అవకాశాలు వచ్చినప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. ఉత్తర టెక్సాస్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జగదీశ్వరన్ రామమూర్తిని సభకు పరిచయం చేశారు. 2008లో ఇండియన్ సైన్స్‌కాంగ్రెస్‌కు రామమూర్తి అధ్యక్షుడిగా వ్యవహరించబోతున్న విషయాన్ని తెలిపారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉప కులపతిగా ఆయన పదవీబాధ్యతలు నిర్వహించినపుడు విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకున్న చర్యలను వెల్ల

డించారు.



అమెరికాలోని ప్రవాసభారతీయుల ప్రముఖనాయకుల్లో ఒకరైన ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం సైన్స్‌కాంగ్రెస్ అధ్యక్షబాధ్యతలు చేపడుతున్న రెండో తెలుగువాడు రామమూర్తి అని సభకు వెల్లడించారు. సైన్స్‌కాంగ్రెస్‌కు నలభై సంవత్సరాల క్రితం డా. సూరి భగవంతం సారథ్యం వహించిన సంగతిని గుర్తు చేశారు.

విద్యా,శాస్త్ర రంగాల్లో రామమూర్తి చేసిన కృషి అనన్యమని ఎంవీఎల్ ప్రసాద్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అనంతరం 'తానా' ఉపాధ్యక్షుడు రాం యలమంచిలి, 'ఆటా' ట్రస్టీ డా. కృష్ణబాపట్ల, టాంటెక్స్ అధ్యక్షుడు మూర్తి మూలుకుట్ల, ఇండో-అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ కార్యదర్శి ప్రసాద్ తోటకూరలు రామమూర్తిని ఘనంగా సన్మానించారు.

ఇర్వింగ్ సైన్స్‌క్లబ్ సారథి డా. సీతామూలుకుట్ల ఆధ్వర్యంలో సైన్స్ ప్రాజెక్టులను బాలలు ప్రదర్శించారు. ఇర్వింగ్‌కు చెందిన నీహారిక మూలుకుట్ల, కవితకోడి, ప్రణవ్ మూలుకుట్ల, వరుణ్ గోరంట్ల, లహరి నీలపరెడ్డి కాపెల్‌కు చెందిన దినేష్, పిరనేసి జొన్నలగడ్డ, ప్రణతి చిట్టా, ప్రియా చిట్టా, శ్రేయ మూలుకుట్ల,కారల్‌టన్‌కు చెందిన అభిషేక్ తదితరులు ఓపన్ హౌజ్ కార్యక్రమంలో రామమూర్తితో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో రామమూర్తి అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. మూర్తి మూలుకుట్ల వందనసమర్పణతో కార్యక్రమం ముగిసింది.